సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 18 । మార్చి । 2025



సోమశిలలో 55.230 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 55.230 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 500, ఉత్తర, దక్షిణ కాలువలకు 750, కండలేరుకు 200, క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.90,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,194
3 శాతం జీఎస్టీతో	రూ.8,440
నవర (8 గ్రా)	రూ.67,520

గరిష్ఠం/కనిష్ఠం 36.2 /25.6

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 71 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం	బుధవారం
సా: 6.22	ఉ: 4.56

న్యూస్‌రీల్

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనం అధ్యాపకులు, ప్రిన్సిపల్స్‌కు సూచనలు ఇస్తున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కేవీసీ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. సంస్కృతం, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్‌మ్యాటిక్స్, సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం చేస్తున్నారు. దాదాపు 480 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. వచ్చే నెల మొదటి వారానికి మూల్యాంకనం పూర్తి కావచ్చన్నారు. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు మిగిలిన సబ్జెక్టుల మూల్యాంకనం జరుగుతుందన్నారు. తొలి విడతలో జరుగుతున్న మూల్యాంకనానికి హాజరుకాని అధ్యాపకులు మూల్యాంకనం కేంద్రంలో రిపోర్ట్ చేయాలన్నారు. గైర్హాజరైన అధ్యాపకులు, సంబంధిత కళాశాలల యాజమాన్యాలపైన ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు చర్యలు ఉంటాయన్నారు.

యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా అల్లం



వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: వైఎస్సార్ జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వీఆర్‌కు ఏఆర్ ఏఎస్పీ

నెల్లూరు (క్రైమ్): ఏఆర్ ఏఎస్పీ జి. మునిరాజాను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మునిరాజా గతేడాది అక్టోబర్‌లో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా విధుల్లో నిర్లక్ష్యం, వివిధ ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. దీంతో ఆయన విధుల నుంచి రిలీవ్ అయి పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసేందుకు వెళ్లారు.

ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం

- రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- కంట్రోల్ రూమ్ నంబర్ 85208 79979 ఏర్పాటు
- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు (అర్బన్): ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు మరింత వేగంగా జరపనున్నామని జేసీ కార్తీక్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 300 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి ఒకటి, రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో 3.50 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. 250 లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపేందుకు సిద్ధం చేశామన్నారు. లారీలు జిల్లా దాటి వెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి రోజు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. మద్దతు ధరకన్నా తక్కువకు కొనుగోలు చేసే రెండు మిల్లులపై కూ డా కేసులు నమోదు చేశామన్నారు. రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులుంటే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 85208 79979 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

వినరే.. వినతులు బుట్టదాఖలు

ప్రహసనంగా పరిష్కార వేదిక

- కలెక్టరేట్‌కు వస్తే మండల అధికారులకే రెఫర్
- అక్కడా పరిష్కారం కాక మళ్లీ కలెక్టరేట్‌కే..
- అధికార పార్టీ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్న అధికారులు
- రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖల ఫిర్యాదులే అధికం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవితాలు కష్టాలమయంగా మారాయి. ప్రజల దైనందిన జీవితంలో రెవెన్యూ, సర్వే, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పౌరసరఫరాలు, విద్యుత్, హౌసింగ్, నీటి పారుదల శాఖల పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మండల కార్యాలయాలకు వెళ్తే అక్కడ ఉలుకు పలుకు లేకపోవడంతో నేరుగా కలెక్టర్‌కు చెప్పుకుంటే కష్టాలు తీరతాయని భావించి వ్యయప్రయాసలు పడి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారు. కానీ ఆ అర్జీలు తిరిగి మండల కేంద్రాలకు చేరుతుండడంతో బుట్టదాఖలు అవుతున్నాయి.



➡ ఈ చిత్రంలో కనిపిస్తున్న 84 ఏళ్ల వృద్ధురాలి పేరు గోచిపాతల మరియమ్మ. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక. ఆమె తండ్రి వెంకయ్యకు మరియమ్మ ఏకైక సంతానం. వెంకయ్య ఆర్మీలో 1939 నుంచి 1945 వరకు పని చేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం బ్రాహ్మణక్రాకలోని సర్వే నంబర్ 2081/3లో 2.34 సెంట్లు, మరో చోట మరికొంత భూమి కలిపి 5 ఎకరాలు పట్టా అందజేసింది. ఆ భూమిని ఆయన బంకా అయ్యన్నకు కౌలుకు ఇచ్చి కౌలు డబ్బులతో బతికేవాడు. మరియమ్మ కూడా రైల్వేలో చిరుద్యోగిగా పశ్చిమగోదావరి జిల్లాలో పని చేస్తుండేది. వెంకయ్య వయోభారంతో 1982లో మృతి చెందడంతో ఆ కౌలు మొత్తాన్ని ఆయన కుమార్తె మరియమ్మకు 2002 వరకు ఇస్తుండేవారు. ఆ తర్వాత బంకా అయ్యన్న 2.34 ఎకరాల పొలాన్ని రెవెన్యూ అధికారులను లోబర్చుకుని తన పేరుతో మార్చుకున్నాడు. మరోచోట ఉన్న 1.14 ఎకరాల తన పొలాన్ని కృష్ణారెడ్డికి కౌలుకు ఇవ్వగా ఆ పొలాన్ని ఆయన ఆక్రమించాడు. ప్రశ్నించిన ఆమెపై దౌర్జన్యం చేయడంతో పలుమార్లు ఆమె కలెక్టరేట్ చుట్టూ తిరిగి న్యాయం చేయాలని వేడుకుంది. అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు సర్వే చేయించి హద్దులు వేయించేలా చర్యలు చేపట్టారు. గతేడాది ఏప్రిల్‌లో పొలాన్ని ఆమెకు అప్పగించారు. అయితే ఆమె తన పొలం వద్దకు వెళ్తే బంకా అయ్యన్న మరో వ్యక్తి మాధవతో కలిసి అడ్డుకుంటూ బెదిరిస్తున్నాడు. దీంతో భయపడిన ఆమె పోలీసులకు దగ్గరకు వెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ సంవత్సరం కాలంగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉంది. ప్రస్తుత కలెక్టర్ ఆనంద్ కూడా తహసీల్దార్‌తో మాట్లాడి ఆదేశాలు జారీ చేసినా.. కింది స్థాయిలో అధికారులు స్పందించడం లేదు. స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే తహసీల్దార్ స్పందించడం లేదని తెలుస్తోంది.



కలెక్టరేట్‌లో సోమవారం అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

8 నెలల్లో రిజిస్టర్ అయిన అర్జీలు	32,754
ఆన్‌లైన్‌లో నమోదు కానివి	3 వేల పైమాటే
పరిష్కరించినట్లు చెబుతున్న అర్జీలు	28,913
పరిష్కారానికి నోచుకోని అర్జీలు	3,841
ప్రతి వారం వస్తున్న అర్జీల సంఖ్య	400 పైమాటే

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

నెల్లూరు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక.. ఒక ప్రహసన కార్యక్రమంగా మిగిలిపోతోంది. ప్రతి సోమవారం కలెక్టర్ నుంచి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటున్న ఈ వేదిక సామాన్య ప్రజలకు పరిష్కారం చూపించి భరోసా కల్పించలేకపోతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలే నిదర్శనంగా ఉంది. ప్రతి వారం జిల్లా నలుమూలల నుంచి 400 నుంచి 450 అర్జీలు వస్తున్నాయంటే మండల కేంద్రాల్లో ఆయా శాఖల అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. పేదలమైన తమ భూములను పెద్దలు గుంజుకుంటున్నారు. రైతులకు పాస్‌బుక్‌లు సకాలంలో ఇవ్వడం లేదు. రోడ్లు, బాటలను కబ్జా చేస్తున్నారు. శ్మశాన స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జాచేయాలని చూస్తున్నారు.. అంటూ ఇలాంటి సమస్యలు మండల కేంద్రాల్లో పరిష్కారం కాకపోవడంతో ఎంతో ఆశతో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక వద్దకు బాధితులు క్యూ కడుతున్నారు. కొన్ని చోట్ల ఆక్రమణదారులకు ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా బాధితులు కలెక్టరేట్ చుట్టూ, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మండలాల్లో పరిష్కారం కాలేదని కలెక్టరేట్‌కు వస్తే...

మండల కేంద్రాల్లో ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ తహసీల్దార్‌గాని, ఎంపీడీఓ గాని, ఇతర అధికారులు సమస్యలను పరిష్కరించకుండా తిప్పుకుంటున్నారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి ఒక రోజు కూలీ వదులుకుని, ఛార్జీలు పెట్టుకుని, తినీ తినక కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారు. అయితే కలెక్టరేట్‌లో అర్జీలు తీసుకుని అధికారులు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. మళ్లీ మండల కేంద్రాలకే అర్జీదారులను పంపుతున్నారు. ఇక సమస్య పరిష్కరించేసినట్టేనంటూ ఆన్‌లైన్‌లో అర్జీలను క్లోజ్ చేస్తున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

అర్జీదారుల సంఖ్య ఎందుకు తగ్గడం లేదు

అధికారులు చెబుతున్నట్లు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉంటే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో సుమారు 400 వరకు అర్జీదారులు ఎందుకు వస్తున్నారంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ రావాల్సి వస్తుందని బాధ పడుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌ను పరిశీలించగా ఆన్‌లైన్ చేసిన అర్జీలు 303 రాగా, మరో 70కి పైగా ఆన్‌లైన్ కాకుండా అర్జీలు వచ్చాయి.



➡ ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బాపట్ల బుజ్జయ్య. బోడసిద్ధాయపల్లి గ్రామం. సీతారామపురం మండలం. పేద గిరిజన కుటుంబానికి చెందిన ఆయన తాత, ముత్తాతల కాలం నుంచి అడవిని ఆనుకుని ఉన్న భూములను చదును చేసి 2 ఎకరాల్లో మెట్ట పైర్లు వేసుకుంటున్నాడు. మరో 24 మంది ఎస్టీలు కూడా 30 సెంట్లు, అరెకరా.. ఇలా సాగు చేసుకుంటున్నారు. అయితే ఇటీవల ఏడాది కాలంగా కొంతమంది గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు పేదలు సాగు చేసుకుంటున్న ఎస్టీ భూములను ఆక్రమించారు. పొలాల్లోనికి రానీయడం లేదు. దీని మీద ఇప్పటికే బాపట్ల బుజ్జయ్య కలెక్టరేట్‌కు మూడుసార్లు వచ్చి అర్జీలు ఇచ్చాడు. కలెక్టరేట్ అధికారులు ఆ అర్జీలను తహసీల్దార్‌కు పంపిస్తున్నారు. తహసీల్దార్, వీఆర్వో వచ్చి సర్వే చేసి, పరిశీలించి వెళ్లారు. పొలాలు ఎస్టీల సాగులోనే ఉన్నాయని చెబుతున్నారు. కానీ పొలాలు మాత్రం ఎస్టీలకు అప్పగించడం లేదు. కలెక్టరేట్ అధికారులు మాత్రం సమస్యను పరిష్కరించినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి సమస్య పెండింగ్‌లోనే ఉంది.

కూటమి ప్రచార ఆర్భాటమే

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజాసమస్యల పరిష్కార వేదికగా గ్రీవెన్స్‌ను మార్చింది. 8 నెలల కాలంలో కలెక్టరేట్‌కు 32,754 అర్జీలు వచ్చాయి. వాటిలో 28,913 పరిష్కరించామని మిగతా 3,841 మాత్రమే పరిష్కరించాల్సి ఉందని కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు. అర్జీలు వివరాలు పరిశీలించగా ..

విభాగం	వచ్చిన అర్జీలు	పరిష్కరించినవి	పెండింగ్‌లో
రెవెన్యూ	16,125	2,871	3,008
సర్వే సెటిల్‌మెంట్	9,246	8,871	375
పోలీసుశాఖ	2,128	2,003	125
పంచాయతీరాజ్ శాఖ	1,617	1,497	120
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	1,388	1,317	71
సివిల్ సప్లయిస్	755	714	41
హౌసింగ్	651	638	13
ఏపీఎస్పీడీసీఎల్	318	291	27
వాటర్ రీసోర్సింగ్	295	251	44
పంచాయతీ ఇంజనీరింగ్	231	214	17
మొత్తం	32,754	28,913	3,841

పొలాన్ని చూపాలని కాళ్లరిగేలా తిరుగుతున్నా..



మా తండ్రి సుబ్బరాయుడు మిలిటరీలో జీపు డ్రైవర్. ఆయనకు నెల్లూరు పడారుపల్లిలో 5 ఎకరాలు ప్రభుత్వం ఇచ్చింది. అయితే అది ప్రభుత్వ అవసరాలకు జానకమ్మ కలెక్టర్‌గా ఉన్నప్పుడు తీసుకుని పొదలకూరు తహసీల్దార్ వద్దకు పంపారు. అక్కడి తహసీల్దార్ మండలంలోని ఆల్తుర్తి వద్ద తనకు 5 ఎకరాలు కండలేరు కాలువ కింద కేటాయించి పట్టా ఇచ్చారు. పాస్ బుక్స్ ఇవ్వాలని 2016 నుంచి తహసీల్దార్ చుట్టూ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు ఇవ్వలేదు. న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాను.

– తడకలూరు సోమశేఖరయ్య, ప్రశాంతినగర్, మైపాడురోడ్డు

కలెక్టర్ చెప్పినా తహసీల్దార్ ఇబ్బంది పెడుతున్నాడు



నందిపోగు రమణయ్య, వ్యవసాయకార్మిక సంఘం విజయమ్మ, జ్యోతి తదితరులు

కోవూరు నందలగుంట గిరిజనులకు ఆ సమీపంలో 15 సెంట్ల శ్మశాన స్థలం ఉంది. శ్మశానం పక్కనే ఒక వ్యక్తి ప్రైవేట్ ఆస్పత్రి నిర్మిస్తూ శ్మశాన స్థలాన్ని ఆక్రమించాడు. ఈ విషయమై మూడు నెలలుగా ప్రతి వారం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాం. కలెక్టర్ ఆనంద్ స్పందించి తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. తహసీల్దార్, వీఆర్వో సర్వే చేసి శ్మశాన స్థలాన్ని గత నెల 11వ తేదీన గిరిజనులకు అప్పగించారు. హద్దులు కూడా వేయించారు. అయితే ఏమి జరిగిందో ఏమో నెల తిరిగే లోపు కలెక్టర్ రాతపూర్వకంగా తనకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని తహసీల్దార్ చెప్పారు. అందువల్ల కలెక్టర్ వద్దకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకోవాలని ఇప్పుడు మెలిక పెట్టారు. ఇది గిరిజనుల శ్మశాన వాటిక కాదని చెబుతున్నారు. దీని వెనుక ఏ పెద్దలు ఉన్నారో తమకు అర్థం కావడం లేదు. కలెక్టర్ ఈ రోజు కూడా ఆ శ్మశాన స్థలం గిరిజనులదేనని చెప్పారు. ఆచరణలో మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కలెక్టర్ ఆదేశాలు ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఒత్తిడితో అధికారులు అన్యాయంగా వ్యవహరిస్తున్నారు.

– నందిపోగు రమణయ్య, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ, జ్యోతి, నందలగుంట గిరిజనులు

నా భూమిని కాపాడమని తిరుగుతున్నా



నాకు నలుగురు ఆడ పిల్లలు. అనంతపురంలో సుమారు 6 ఎకరాల వరకు బిట్లు, బిట్లుగా పొలం ఉంది. కొంత మంది నా పొలాన్ని, ఇంటిని ఆక్రమించాలని చూస్తున్నారు. కిష్టమ్మ, రఘురామిరెడ్డి 1.70 ఎకరాలు ఆక్రమించారు. బావి దగ్గరకు పోనివ్వడం లేదు. పొలానికి వెళ్లే కాలువను తెగ్గొట్టారు. పోలా సురేష్, దశయ్య, మరికొంత భూమిని ఆక్రమించారు. నేను వయోభారంతో ఉండడంతో ఇబ్బంది పెడుతున్నారు. నా బాధ కలెక్టర్‌కు మొర పెట్టుకున్నాను. తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. అయితే మా గ్రామంలో కొంత మంది ఒత్తిడి వల్ల స్థానిక అధికారులు పట్టించుకోలేదు. నాలుగో దఫా కలెక్టరేట్‌కు వచ్చాను.

– కాకు మాలకొండారెడ్డి, అనంతపురం, కలిగిరి మండలం

భూమి మా ప్రాణం.. జీవనాధారం

- భూములు లాక్కుంటే ఆత్మహత్యలే
- మూడు పంటలు పండే భూములు పరిశ్రమలకు ఇవ్వం
- ఈ నెల 25 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు



భూములు ఇవ్వమంటూ ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో నినాదాలు చేస్తున్న రైతులు

కావలి: మూడు పంటలు పండే మా భూములు మా ప్రాణం, మా జీవనాధారం. అటువంటి భూములను బలవంతంగా లాక్కుంటామంటే ఊరుకునేది లేదని, అధికారులు మొండిగా వ్యవహరిస్తే.. సామూహిక ఆత్మహత్యలకు కూడా వెనుకాడేది లేదని మండలంలోని తీర ప్రాంతాల రైతులు తెగేసి చెప్పారు. మండలంలోని ఆనెమడుగు, మొండిదిన్నెపాళెం కట్టకిందపాళెం, బైనేటివారిపాళెం, ఆకుతోట గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, గీత కార్మికులు, గ్రామాల్లో ప్రజలు తమ అభిప్రాయాలు తీసుకోకుండా భూములు లాక్కోవాలని 91 డిక్లరేషన్ ప్రకటించడంపై రైతులు నిరసన నినాదాలతో హోరెత్తించారు. రైతుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా, ఏడాదికి మూడు పంటలు పండే భూములను పరిశ్రమలకు ఎలా కేటాయిస్తారంటూ వందలాది మంది రైతులు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆర్డీఓకు, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అధికారుల వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. కాకినాడకు చెందిన పారిశ్రామికవేత్తల కోసం కావలి తీరంలో భూములు సేకరించడం దారుణమన్నారు. ఈ భూములపై ఆధారపడి ఐదు గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఈ నెల 25 నుంచి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సామూహికంగా ఆత్మహత్యలకైనా సిద్ధమే కానీ ఒక్క సెంటు భూమి కూడా వదులుకోమని తెలిపారు. దీంతో ఆర్డీఓ వంశీకృష్ణ బయటకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కావలికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాల్లో సంవత్సరానికి మూడు పంటలు పండే భూముల మీద 1,200 కుటుంబాలు, 400 కల్లుగీత కుటుంబాలు, 300 పాడి రైతు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. 2013 భూసేకరణ చట్టప్రకారం బహుళ పంటలు పండే భూములు తీసుకోకూడదని చెప్పారు. గ్రామ సభలో పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోవాలని, 80 శాతం ఆమోదం పొందాలని చట్టంలో ఉన్నా అధికారులు ఆ చట్టాన్ని తుంగలో తొక్కారని తెలిపారు. ప్రజలు చూడని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి భూములు లాక్కోవాలని చూడడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ్మరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, మండల కార్యదర్శి రాధాకృష్ణయ్య, రైతు సంఘం నాయకులు గడ్డం మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తుమ్మల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పది పరీక్షలు

- కొన్ని సెంటర్లలో ఆలస్యంగా పరీక్ష ప్రారంభం
- వావిళ్ల సెంటరులో తాళాలు పగులకొట్టి తలుపులు తీసిన పేరెంట్స్
- వసతులు లేక ఇబ్బందులు పడిన విద్యార్థులు



నగరంలోని ఎంఎస్ఎం మున్సిపల్ స్కూల్ వద్ద..

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలి రోజు సోమవారం అస్తవ్యస్తంగా నిర్వహించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సెంటర్లలో ఆలస్యంగా పరీక్షలు జరిగినట్లు తెలిసింది. కొన్ని సెంటర్లలో వసతులపై పేరెంట్స్, సెంటరు అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. విడవలూరు మండలం వావిళ్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ గది తాళాన్ని పగుల కొట్టి విద్యార్థులు లోపలికి పంపించిన పరిస్థితి ఏర్పడింది. నగరంలోని మాగుంట లేవుట్‌లోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 15 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనట్లు విద్యార్థులు చెప్పారు. నగరంలోని ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో వసతులపై పేరెంట్స్, సెంటర్ నిర్వాహకులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. చాలా సెంటర్లలో సరైన గాలి, వెలుతురు లేకపోవడంతో ఉక్కపోతతో పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాగునీటి ఏర్పాట్లు కూడా చేయలేదని చెబుతున్నారు. ఎండ తీవ్రత ఓ వైపు, ఇరుకు గదుల్లో పరీక్ష నిర్వహించినట్లు సమాచారం. పలు కేంద్రాల్లో హాల్ టికెట్ల నంబర్ల డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో గదులు ఎక్కడో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని సెంటర్ల అడ్రసు సరిగా లేకపోవడంతో వెతకడానికే సమయం సరిపోయిందంటున్నారు. విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు పరీక్ష కేంద్రం బయటే పడిగాపులు కాశారు. వారికి తాగేందుకు నీరు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. ఈ విషయంపై డీఈఓకు ఫోన్ చేయగా సరైన కారణాలతో ఆలస్యంగా ప్రారంభమైన సెంటర్లలో అదనంగా సమయం కేటాయించమని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

384 మంది గైర్హాజరు

తొలి రోజు తెలుగు పరీక్షకు 28,496 మంది రెగ్యులర్, 734 మంది ప్రైవేట్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. రెగ్యులర్ 28,492 మంది, ప్రైవేట్ విభాగంలో 354 మంది హాజరయ్యారు. మొత్తంగా 380 మంది గైర్హాజరయ్యారు.

మోసపోయాం.. న్యాయం చేయండయ్యా

• ఎస్పీకి బాధితుల వినతి

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగాలు.. మెడికల్ సీట్లు.. వీసాల పేరిట రూ.లక్షల్లో దోచేసిన మోసగాళ్లపై చర్యలు చేపట్టాలని పలువురు బాధితులు కోరారు. ఈ మేరకు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి కృష్ణకాంత్‌కు 75 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయా ప్రాంత పోలీస్ అధికారులను ఆదేశించారు. మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగర, కావలి డీఎస్పీలు సింధుప్రియ, శ్రీధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్



ఫిర్యాదుల్లో కొన్ని..

• వాట్సాప్‌లో జ్యోతిర్నాథ్ పరిచయమై సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.2.1 లక్షలను తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా, ఉద్యోగమిప్పించకపోవడంతో గట్టిగా ప్రశ్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. అతనిపై చర్యలు చేపట్టాలని వేదాయపాళేనికి చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశారు.

• తమిళనాడుకు చెందిన లక్ష్మీనారాయణ, సెల్వం అదే రాష్ట్రంలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో పీజీ మెడికల్ సీటు ఇప్పిస్తానని రూ.20 లక్షలు వసూలు చేశారు. ఇప్పించకపోవడంతో నిలదీయగా, దౌర్జన్యం చేస్తున్నారు. వీరిపై చర్యలు చేపట్టాలని వేదాయపాళేనికి చెందిన ఓ వ్యక్తి కోరారు.

• వేదాయపాళేనికి చెందిన వెంకట్రావు బీవీనగర్‌లోని స్టీల్ కంపెనీలో డీజిల్ మోటార్లను ఇప్పిస్తానని రూ.4.2 లక్షలు తీసుకున్నారు. వీటిని ఇప్పించకుండా కాలయాపన చేస్తుండటంతో ఇటీవల గట్టిగా నిలదీయగా, బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విన్నవించారు.

• అబుదాబీలో పనిచేసేందుకు వర్కింగ్ వీసా ఇప్పిస్తామని, నెలకు రూ.80 వేల జీతమొస్తుందని నమ్మించి రూ 2.7 లక్షలను విజయవాడకు చెందిన రామకృష్ణ, దివ్య, జగిత్యాలకు చెందిన శ్రీనివాస్, రిజ్వానా, ఆస్సు తీసుకున్నారు. విజిటింగ్ వీసా ఇచ్చి మోసం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని, వీరిపై చర్యలు చేపట్టాలని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ వ్యక్తి విజ్ఞప్తి చేశారు.

• ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలిప్పిస్తామంటూ మా వద్ద రూ.5.62 లక్షలను అనంతసాగరానికి చెందిన ఖాజామొహిద్దీన్ తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేకపోవడంతో, నిలదీయగా దౌర్జన్యం చేస్తున్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు కోరారు.

• తన పేరుపై ఉన్న ఆస్తిని రాసివ్వాలని కొడుకు, కోడలు చిత్రహింసలకు గురిచేస్తూ, తన వస్తువులను ధ్వంసం చేసి దుస్తులను కాల్చేశారు. వీరిపై చర్యలు చేపట్టాలని తోటపల్లిగూడూరుకు చెందిన ఓ వృద్ధుడు విన్నవించారు.

• అల్లూరుకు చెందిన సుమంత్, అతని తండ్రి నాపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని అల్లూరుకు చెందిన ఓ వృద్ధుడు వేడుకున్నారు.

వెల్లువెత్తిన అర్జీలు

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులకు అర్జీలను అందజేసి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిని కలెక్టర్ ఆనంద్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగా భవానీ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు స్వీకరించారు. కాగా వివిధ సమస్యలపై మొత్తం 303 అర్జీలు అందాయి.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్



మెడికల్ వేస్ట్ సేకరణకు అనుమతించాలి

గ్రామీణ ప్రాంతాల్లో బయో మెడికల్ వేస్ట్‌ను సేకరించే కార్మికుల్లేకపోవడంతో దాన్ని ఇష్టమొచ్చినట్లు పారేస్తున్నారని ఏవీఐ బయోకేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. వీటిని సేకరించే అవకాశాన్ని తమకు ఇవ్వాలని కోరారు. జిల్లా వైద్య శాఖ సూచన మేరకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తామన్నారు. కోటేశ్వరరావు, రాజేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఏర్పాటుకు వినతి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నేతలు

పెన్షనర్ల కోసం 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఐఆర్‌ను ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. డీఆర్, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. శాస్త్రి, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత భోజన వసతి

నెల్లూరు(అర్బన్): అర్జీదారుల కోసం భోజన సదుపాయాన్ని కలెక్టర్ ఆనంద్ కల్పించారు. అన్న క్యాంటీన్ ద్వారా భోజనాన్ని అందించారు. అర్జీదారులతో పాటు వారి సహాయకులు కలిపి సుమారు 500 మంది వరకు భోజనం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ సదుపాయాన్ని కల్పించడం సంతోషాన్ని కలిగించిందని కలెక్టర్ తెలిపారు.



ధాన్యం ధరలు పతనమయ్యాయి



మాట్లాడుతున్న రైతు సంఘ నేతలు

జిల్లాలో ధాన్యం ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయని అఖిల భారత రైతు సంఘ నేతలు కోటిరెడ్డి, రాపూరు రాధాకృష్ణనాయుడు, శ్రీనివాసులురెడ్డి, షానవాజ్, నెల్లూరు రమణయ్య తెలిపారు. పుట్టికి రూ.16,500 మేరే మిలర్లు, దళారులు ఇస్తున్నారని, నెమ్ము పేరుతో 70 కిలోలను అదనంగా తీసుకుంటున్నారని వాపోయారు. జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా మారాయని, వంద కేంద్రాల ద్వారా 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే సేకరించారని చెప్పారు. గోతాల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్యాంక్ గ్యారెంటీలను మిల్లర్లు ఇవ్వడంలేదని చెప్పారు.

ఎండల తీవ్రతతో జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరు రూరల్: ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఇంజినీరింగ్ శాఖలు, డ్వామా అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంతో పాటు నీటి కియోస్కులను ఏర్పాటు చేయాలన్నారు. కూలీలు, నిర్మాణ కార్మికులు మధ్యాహ్న సమయంలో పనిచేయకుండా చూడాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైతే చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూగజీవాలను రక్షించేందుకు పశుసంవర్ధక అధికారులు కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్

ఏపీపీగా చెంచుకృష్ణ

నెల్లూరు (లీగల్): మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు చెంచుకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ఏపీపీగా మూడేళ్లు ఆయన కొనసాగనున్నారు. కాగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.



తలకు తీవ్రగాయమై యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పక్కనున్న మిద్దెపై పడి తలకు తీవ్ర గాయమై యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని కొరడావీధిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుబ్రత సమంత ఉపాధి నిమిత్తం నగరానికి పదేళ్ల క్రితం వచ్చి కోటమిట్టకు చెందిన అన్వర్‌బాషా వద్ద బంగారు ఆభరణాల తయారీ పనులు చేసుకుంటూ కొరడావీధిలో నివసిస్తున్నారు. ఈయన చిన్నాన్న కుమారుడు సునీల్ సమంత (27) నెల్లూరుకు ఎనిమిదేళ్ల క్రితం వచ్చి కొరడావీధిలోని మొహిద్దీన్ వద్ద బంగారు పనులు చేస్తున్నారు. సమీపంలో ఉన్న సురేంద్ర కాంప్లెక్స్‌లోని నాలుగో అంతస్తులో గల పెంట్‌హౌస్‌లో స్నేహితులు జయంత్, జయంత్‌సైన్‌తో కలిసి ఉంటున్నారు. ఈ ముగ్గురూ ఆదివారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. అనంతరం భోజనం చేసేందుకు లోపలికి వీరు వెళ్లగా, సునీల్ సమంత బయటే ఉన్నారు. ఈ తరుణంలో పక్కనే ఉన్న మిద్దెపై సునీల్‌సమంత పడ్డారు. శబ్దం రావడంతో బయటకు పరుగులు తీసిన స్నేహితులు జరిగిన విషయాన్ని స్థానికంగా ఉన్న దస్తగిరి ద్వారా సుబ్రత సమంతకు తెలియజేశారు. ఘటన స్థలానికి హుటాహుటిన ఆయన చేరుకున్నారు. తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో ఉండటంతో 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు పరిశీలించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు మృతుడి సోదరుడు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుల్తాన్‌బాషా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించడంతో తమ స్వస్థలానికి తరలించారు.



ఐదు కిలోల కణితి తొలగింపు

• పెద్దాస్పత్రి వైద్యుల ఘనత

నెల్లూరు(అర్బన్): తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన 35 ఏళ్ల తాటిపర్తి శశికళకు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఆపరేషన్ చేసి ఆమె తొడ భాగం నుంచి ఐదు కిలోల కణితిని తొలగించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి జనరల్ సర్జన్ కాలేషాబాషా సోమవారం వెల్లడించారు. ఎడమ తొడ భాగంలో కణితి ఏర్పడి క్రమేపీ పెరుగుతూ వచ్చిందని, నొప్పి ఎక్కువ కావడంతో పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆమె ఆశ్రయించారని చెప్పారు. రూ.లక్షల్లో ఖర్చవుతుందని చెప్పడంతో పెద్దాస్పత్రికి ఆమె వచ్చారన్నారు. రూపాయి ఖర్చు లేకుండా.. లోపలి రక్తనాళాలకు ఇబ్బంది లేకుండా ఆపరేషన్ ద్వారా కణితిని తొలగించామని తెలిపారు. తనతో పాటు డాక్టర్లు సుహాసిని, ఉమామహేష్, మత్తు వైద్యులు శారదతో కూడిన వైద్య బృందం ఆపరేషన్‌లో పాల్గొందని తెలిపారు. ఆపరేషన్‌ను విజయవంతంగా చేసిన డాక్టర్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ అభినందించారు.



కణితిని చూపుతున్న డాక్టర్ సుహాసిని

నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ ధర్నా

నెల్లూరు రూరల్: యువతకు ఉద్యోగాలు కల్పించాలని, లేకపోతే నిరుద్యోగ భృతినైనా ఇవ్వాలని ఏఐవైఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. నిరుద్యోగ భృతికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఎన్నో హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చాక వీటిని విస్మరించారని ఆరోపించారు. మెగా డీఎస్సీ కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. వేలాది మంది నిరుద్యోగులు అప్పులు చేసి కోచింగ్ తీసుకుంటున్నారని, నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలపై స్పందించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నం

వరికుంటపాడు: వృద్ధురాలిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన వరికుంటపాడులో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన 84 ఏళ్ల వృద్ధురాలు మెయిన్ రోడ్డు సమీపంలోని తన నివాసంలో కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన 34 ఏళ్ల యువకుడు ఆమె ఇంట్లోకి ఆదివారం అర్ధరాత్రి సమయంలో వెళ్లి లైంగిక దాడికి యత్నించారు. ఆమె కేకలేయడంతో పరారయ్యారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై రఘునాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు

పెద్దవి: రూ.90
సన్నవి: రూ.60
పండ్లు: రూ.40



మాయమాటలు చెప్పడంలో సిద్ధహస్తులు

• చంద్రబాబుపై మండిపడిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): మాయమాటలు చెప్పడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తులని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేసింది తానేనని ఆయన ప్రకటించడమే దీనికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని పచ్చ పత్రికలో ప్రచురించడం మరో విడ్డూరమని విమర్శించారు. వాస్తవానికి పొట్టి శ్రీరాములు జిల్లాగా 2008 జూన్‌లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ప్రకటించిన అంశం అందరికీ తెలుసునన్నారు. దీనికి సంబంధించి అదే ఏడాది మే 25న జీఓ విడుదలైన అంశాన్ని ప్రస్తావించారు. ప్రజలు నవ్వుకుంటారనే కనీస ఆలోచన లేకుండా చంద్రబాబు ఇలా అబద్ధాలు చెప్పడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెండ్ల విషయంలోనూ ఆయన గతంలో ఇదే తరహాలో విచిత్ర వ్యాఖ్యలు చేసిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రతి గొప్ప పనినీ తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు మొదట్నుంచి అలవాటని విమర్శించారు. అమరజీవి 56 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామని చంద్రబాబు ప్రకటించారని, గతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించి, దాన్ని విస్మరించారని ఆరోపించారు. ఆయన మాటలు వింటే పొట్టి శ్రీరాములు ఆత్మ క్షోభిస్తుందని చెప్పారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రైతుల బాధలు వర్ణనాతీతం

పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలేదని, దీంతో అన్నదాతల ఆవేదన వర్ణనాతీతంగా మారిందని కాకాణి చెప్పారు. అధికారుల లెక్కలు తప్పడం.. వాస్తవాలు ప్రభుత్వ దృష్టికి రాకపోవడంతో రైతులకు మేలు జరగడంలేదని టీడీపీ అనుకూల పత్రికల్లో ప్రచురించారన్నారు. తాను చేస్తున్న తప్పులను వదిలేసి అధికారులపై నింద వేసి తప్పించుకునే ధోరణిని ఆయన అవలంబిస్తున్నారనే అంశాన్ని అందులో పేర్కొన్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే సదరు మీడియా సంస్థ స్వరం మారిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పుట్టి ధాన్యానికి రూ.19,720 గిట్టుబాటు ధర కల్పిస్తే, అది ప్రస్తుతం రూ.15,500కు పడిపోయిందని వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కలిగిరి: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన సోమవారం వెలుగులోకి వచ్చింది. విషయాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎస్సై ఉమాశంకర్ పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా నెల్లూరుకు చెందిన రాఘవరెడ్డి (60)గా గుర్తించారు. కలిగిరికి చెందిన రాఘవరెడ్డి 20 ఏళ్లుగా నెల్లూరులో ఉంటూ, అక్కడే కార్ల షోరూమ్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఒంటరిగా జీవిస్తున్నారు. కలిగిరి, వింజమూరులో ఉన్న బంధువుల వద్దకొచ్చి ఇలా విగతజీవిగా మారారు. కాగా మరణ వార్తపై బంధువులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి వారు చేరుకొని ఎలాంటి కేసు అవసరం లేదని చెప్పి రాఘవరెడ్డి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మద్యం సేవించి మృతి చెంది ఉండొచ్చని బంధువులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

